క్లుప్తంగా

టాలెంట్ టెస్ట్‌లో మానాల విద్యార్థి ప్రతిభ



డీఈవో చేతులమీదుగా ప్రథమ బహుమతి అందుకుంటున్న అజయ్

రుద్రంగి: సాంఘీకశాస్త్ర ఫోరం ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన సోషల్ టాలెంట్ టెస్టులో రుద్రంగి మండలం మానాల జెడ్పీ హైస్కూల్ విద్యార్థి గుగ్రవు అజయ్ ప్రతిభ కనబర్చి ప్రథమస్థానంలో నిలిచాడు. జిల్లా విద్యాధికారి రమేశ్ చేతుల మీదుగా ప్రథమ బహుమతి, నగదు అందుకున్నాడు. రాష్ట్ర స్థాయి టాలెంట్ టెస్టుకు అర్హత సాధించాడు. ఈసందర్భంగా అజయ్‌ను పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

విజయవంతం చేయాలి



పోస్టర్ విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

సిరిసిల్లఎడ్యుకేషన్: ఖమ్మంలో ఈ నెల 11,12వ తేదీల్లో నిర్వహించే రాష్ట్ర ద్వితీయ విద్య, వైజ్ఞానిక మహాసభలకు విద్యావంతులు, మేధావులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాతూరి మహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శనివారం విడుదల చేశారు. రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యలతోపాటు విద్యారంగంలో ప్రభుత్వ అనుసరించాల్సిన మార్గాలపై మహాసభల్లో చర్చ జరగనున్నట్లు పేర్కొన్నారు.

మంత్రి పొన్నంపై విమర్శలు అర్థరహితం



మాట్లాడుతున్న బాల్‌రెడ్డి

ముస్తాబాద్: కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ సరదాగా వేదికపై ఉన్న నాయకులను కదిలిస్తే.. దీనిపై బీఆర్‌ఎస్ నాయకులు విమర్శలు చేయడం అర్థరహితమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అన్నారు. శనివారం ముస్తాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మంత్రులు, ఎమ్మెల్యేలను కలిసే అవకాశం లేదని, కానీ కాంగ్రెస్ హయాంలో అలా కాదని, సీఎం, మంత్రులు అందరూ ప్రజల్లోనే ఉంటారని పేర్కొన్నారు. మంత్రిని విమర్శిస్తే ఊరుకునేది లేదన్నారు. పట్టణాధ్యక్షుడు గజ్జెల రాజు, ఎంపీటీసీ శ్రీనివాస్, డీసీసీ ప్రధాన కార్యదర్శి పెద్దిగారి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి మిర్యాల్‌కార్ శ్రీనివాస్, రాజిరెడ్డి, కొండల్‌రెడ్డి, తలారి నర్సింలు, నరేశ్, దీటి నర్సింలు, సత్యంగౌడ్, సత్తయ్యగౌడ్, గోవర్ధన్, ధర్మేందర్, రాజు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బ్లాంకెట్లు పంపిణీ



బ్లాంకెట్లు అందిస్తున్న రవి తదితరులు

సిరిసిల్లటౌన్: రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం సిరిసిల్లలో భిక్షాటకులకు బ్లాంకెట్లు పంపిణీ చేశారు. సంస్థ చేపడుతున్న సామాజిక సేవల్లో భాగంగా స్థానిక శ్రీలక్ష్మీవేంకటేశ్వర ఆలయం, రెడ్డివాడ ప్రాంతాల్లో సుమారు 20 మందికి బ్లాంకెట్లను అందించామని రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు గుడ్ల రవి తెలిపారు. ఉపాధ్యక్షుడు ప్రయాకర్‌రావు వేణు, పీసీసీ సభ్యుడు సంగీతం శ్రీనివాస్, కౌన్సిలర్లు గుడ్ల శ్రీనివాస్, రెడ్యానాయక్, రెడ్‌క్రాస్ సభ్యులు కముటాల రఘు, ఇరుకుల్ల భాస్కర్, గుడ్ల సునీల్‌కుమార్, గుడ్ల వెంకట జవహార్ తదితరులున్నారు.

గద్దర్‌పై వ్యాఖ్యలు సరికాదు

ముస్తాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా యుద్ధనౌక గద్దర్ పేరుతో అవార్డులు ప్రకటిస్తే.. కొంత మంది అవహేళన చేస్తూ మాట్లాడటాన్ని ఖండిస్తున్నామని దళిత లిబరేషన్ ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు పెద్దిగారి శ్రీనివాస్, అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు కాంపెల్లి శ్రీనివాస్ అన్నారు. ముస్తాబాద్‌లో శనివారం మాట్లాడారు. ప్రజలను చైతన్యపరిచిన గద్దర్ పేరుతో అవార్డులు ఇస్తే అగ్రకులాల పెద్దలకు ఇది నచ్చడం లేదన్నారు. సోషల్ మీడియాలో ఇష్టానుసారంగా గద్దర్‌ను విమర్శించిన వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ సర్పంచ్ చాకలి రమేశ్, నాయకులు భూమలింగం, చంద్రం, కిషన్ తదితరులున్నారు.

పశువైద్య శిబిరానికి స్పందన

కోనరావుపేట: మండలంలోని బావుసాయిపేటలో నిర్వహించిన పశువైద్య శిబిరానికి స్పందన లభించింది. జిల్లా పశుగ్రామీణాభివృద్ధి సంస్థ(కరీంనగర్), పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో పశువులకు చూడి పరీక్షలు, దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సీఈవో డాక్టర్ గడ్డం శ్రీధర్, వైద్యాధికారి అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్షన్ కింగ్స్

సిరిసిల్లటౌన్: వారు అందరిలాగే సాదాసీదా పౌరులే. ఒకరు బుక్‌స్టాల్ నిర్వహిస్తారు.. మరొకరు కులవృత్తిలో రాణిస్తారు. అయితే అసాధారణ అభిరుచిని చిన్నప్పటి నుంచే పునికిపుచ్చుకున్నారు. పట్టణానికి చెందిన బుడిమె ప్రకాష్ అరుదైన నాణేలు, కరెన్సీ సేకరిస్తే.. కొత్వాల సాయిరాం నాణేలు, కరెన్సీ, పోస్టల్ స్టాంపులు, చరిత్రాత్మక చిత్రాలు సేకరించి పదిల పరిచారు. అరుదైన కళను సొంతం చేసుకున్న ఇరువురిపై కథనం.

- సిరిసిల్ల వాసుల అరుదైన అభిరుచి
- ఒకరు నాణేలు, కరెన్సీ సేకరణ
- మరొకరు నాణేలు, స్టాంపులు, చారిత్రక ఫొటోలు
- శభాష్ అంటున్న ప్రజలు..



ప్రకాష్ సేకరించిన కరెన్సీ, నాణేలు

నాణెం.. అతడి ప్రాణం..

- చెల్లని నాణేలైనా, కరెన్సీ అయినా వాటిని సేకరించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు సిరిసిలకు చెందిన బుడిమె ప్రకాష్. 1982లో మొదలైన ఈ అభిరుచి ఇప్పటికీ కొనసాగుతూ..అసాధారణ కీర్తిని గడించింది. పట్టణంలోని గాంధీచౌక్‌లో వంశీకృష్ణ బుక్ సెల్లర్స్ యజమానిగా నిత్యం బిజీగా ఉంటూ, వివిధ దేశాల కరెన్సీ, పోస్టల్ శాఖ, ఆర్‌బీఐ విడుదల చేసే స్టాంపులు, నాణేలు సేకరిస్తున్నారు. ప్రపంచంలోనే అతి చిన్న నాణేం చెలామణి అయిన నాగసామ్రాజ్య నాణేం, దేశంలో ఈస్ట్ ఇండియా కంపెనీ నోట్లు, నాణేలతో పాటు అమెరికా, ఫ్రాన్స్, స్విట్జర్లాండ్, దుబాయ్, డెన్మార్క్, జర్మనీ, శ్రీలంక, నార్వే తదితర దేశాలకు చెందిన సుమారు 4వేల రకాల కరెన్సీని సేకరించారు. ఒకప్పుడు దేశంలో చెలామణిలో ఉన్న కాణి, అణా, పావలా, అఠాణా, రూపాయి, తుగ్లక్ రాజ్యంలో చెలామని అయిన కరెన్సీని సొంతం చేసుకున్నాడు. వివిధ సందర్భాల్లో పోస్టల్, ఆర్బీఐ విడుదల చేసే రూ.10, రూ.20, రూ.50, రూ.60, రూ.75, రూ.100, రూ.125, రూ.150, రూ.250, రూ.1,000 నాణేలు ఖర్చుకు, శ్రమకు ఓర్చుకుని భద్రపరిచాడు.



నలభై రెండేళ్లుగా..



మొదటగా 1982లో అతి పురాతన కాలం నాణేలు లభ్యం కాగా ఆకర్షితుడినయ్యా. 42 ఏళ్లుగా పురాతన నాణేలు, వివిధ దేశాల కరెన్సీ సేకరణ జరుపుతూనే ఉన్నా. ఇటీవలే కేంద్ర ప్రభుత్వం ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా విడుదల చేసిన రూ.100 నాణేం మొదటగా అందుకుంది నేనే. ముద్దపైస, చిల్లుపైస, రాగినాణెం, వెండినాణెం, బంగారు నాణెం ఇలా ఎన్నెన్నో సేకరించినా, సేకరిస్తూనే ఉంటా. 'ది హైదరాబాద్ ఫిలాటెలిక్ అండ్ హ్యాబిస్ సొసైటీ' సభ్యుడిగా ఉన్నా.

– బుడిమె ప్రకాష్, సిరిసిల్ల

సండే స్పెషల్



సాయిరాం సేకరించిన కరెన్సీ, నాణేలు, చిత్రాల ప్రదర్శనలో కలెక్టర్ తదితరులు(ఫైల్)

ఒకటో శతాబ్దం నుంచి ప్రస్తుతానికి..

కాలగర్భంలో చారిత్రక ఘటనలు కలిసినా వాటి ఆనవాళ్లు, ఆధారాలైన చిత్రాలు, నాణేలు, కరెన్సీ కలకాలం నిలుస్తాయి. ఇందుకు సిరిసిల్లకు చెందిన కొత్వాల సాయిరాం సేకరించిన అరుదైన నాణేలు, కరెన్సీ, చిత్రాలు ఉదాహరణగా చెప్పొచ్చు. సిరిసిల్ల కొత్త బస్టాండులో సెలూన్ నిర్వహిస్తున్న 41ఏళ్ల వయస్సున్న సాయిరాం తన ఆరవ ఏట నుంచే కాయిన్స్, కరెన్సీ సేకరించడం మొదలు పెట్టాడు. అతడి వద్ద ఒకటో శతాబ్దానికి చెందిన రాగినాణేం, నవాబుల కాలం, ఈస్టిండియా ముద్రించిన మహరాణి విక్టోరియా నాణేం, మొహంజదారో హరప్పాయుగం నాణేలు, మన దేశంతో పాటు 44 దేశాలకు చెందిన అరుదైన కరెన్సీ నోట్లు ఉన్నాయి. ఇక మన దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో గాంధీతో పాటు దేశ నాయకుల ఫొటోలు, పోరాట దృశ్యాల క్లిప్పింగ్స్‌ను భద్రపరిచాడు. ఏటా జిల్లా కేంద్రంలో రిపబ్లిక్ డే, ఇండిపెండెన్స్ డే వేడుకల్లో వాటిని ప్రదర్శిస్తూ అధికారులు, మంత్రుల మన్ననలు పొందారు.

చరిత్రపై ఆసక్తితో..



చరిత్ర అంటే నాకు చిన్నప్పటి నుంచి ఆసక్తి ఎక్కువ. స్వాతంత్ర సంగ్రామ క్లిప్పింగ్స్ వందల సంఖ్యలో ఉన్నాయి. అతి పురాతన నాణేలు, వివిధ దశల్లో ప్రత్యేకంగా ముద్రించిన పోస్టల్ స్టాంపులు, దేశ నాయకుల ఫొటోలు భద్రపరిచా. ఒకప్పుడు ఆదరణ ఎక్కువగా పొందిన సినిమా పాత పాటల పుస్తకాలు కూడా ఉన్నాయి.

గాంధీ, స్వామి వివేకానందతో పాటు దేశ నాయకులు, ఎన్టీఆర్, ఏఎన్‌ఆర్ వంటి సినీతారల ఛాయాచిత్రాలు 5వేలకు పైగా సేకరించా. నాబిక్ సమాజ్ భూషణ్ అవార్డు రావడం సంతోషాన్నిచ్చింది.

– కొత్వాల సాయిరాం, సిరిసిల్ల

బల్దియాలో పోటెత్తిన మురుగు



సర్దార్‌నగర్‌లో రోడ్డుపై నిలిచిన మురికినీరు

- అధికారుల వైఫల్యంపై విమర్శలు
- బస్టాండు సమీపంలో కంపు కంపు



వెంకంపేట రోడ్‌లో చెత్తను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది



పాత బస్టాండ్ ప్రాంతంలో మురికినీరు

సిరిసిల్లటౌన్: బల్దియా వైఫల్యం పట్టణ ప్రజలను ఏళ్ల తరబడిగా మురుగు రూపంలో పీడిస్తూనే ఉంది. ఇటీవలే రూ.కోటితో డ్రైనేజీ కట్టించినా సమస్య తీరలేదు. ఫలితంగా శనివారం సిరిసిల్ల పాతబస్టాండు మొదలుకుని ప్రధాన రోడ్డు, సంజీవయ్యనగర్, వెంకంపేట రోడ్డు ప్రాంతం పూర్తిగా మురికినీటితో కూరుకుపోయింది. రాత్రి నుంచి మొదలైన డ్రైనేజీ నీరు ఉదయం వరకు రోడ్డుపై మోకాళ్లోతులో నిలిచింది. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు కంపు వాసనతో ఇబ్బందులు పడ్డారు.

బల్దియా.. ఇదేం దయా

మున్సిపల్ ఆధ్వర్యంలో ఇటీవలే పాతబస్టాండ్-వెంకంపేట ప్రధాన రహదారిని 40 ఫీట్ల రోడ్డుగా విస్తరించారు. రూ.కోటికి పైగా నిధులు వెచ్చించి ఆ ప్రాంతంతో పాటు సంజీవయ్యనగర్‌లో కల్వర్టులు నిర్మించారు. పాలకుల చిత్తశుద్ధి లోపం, ఇంజినీరింగ్ అధికారుల వైఫల్యంతో డ్రైనేజీ కాల్వల నిర్మాణ సమయంలో దొర్లిన పొరపాట్లు ఈ దుస్థితికి కారణంగా స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంతటి దుర్గంధంతో ఎన్నాళ్లీ తిప్పలు పడాలని పాలకవర్గాన్ని, అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సమస్య మళ్లీ తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

మాజీ ఎమ్మెల్యే రమేశ్‌బాబును కలిసిన నాయకులు

కోనరావుపేట: మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ బాబును మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు కలిశారు. ఆయన జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. సెస్ వైస్‌చైర్మన్ దేవర కొండ తిరుపతి, అబ్బసాని శంకర్‌గౌడ్, సీతల్ల మోహన్, వంగపెల్లి శ్రీనివాస్, మాదాస్ భూమయ్య, బొడ్డు చంద్రయ్య తదితరులు ఉన్నారు.

టికెట్ లేకుండా దర్శనాలు

- డబ్బులు వసూలు చేసిన ఆలయ సిబ్బంది



టికెట్లు ఇవ్వకుండా అభిషేకాలకు తీసుకెళ్లారంటూ ఆరోపిస్తున్న భక్తుడు

వేములవాడ: రాజన్న గుడిలో డబ్బులు తీసుకుని టికెట్ లేకుండా అభిషేకాలకు తీసుకెళ్లారని ఓ భక్తుడు శనివారం ఆరోపించాడు. తాను ఓ జర్నలిస్టు కుటుంబానికి చెందిన వాడినని, శనివారం రాజన్నకు అభిషేకాలు చేసేందుకు ఆలయ పీఆర్‌వో ఆఫీస్‌కు వెళ్లినట్లు తెలిపాడు. అక్కడే ఉన్న సిబ్బంది తన వద్ద రూ.3వేలు తీసుకుని టికెట్ ఇవ్వకుండానే ఆరుగురితో అభిషేక పూజలు చేయించారని ఆరోపించాడు. ఇటీవల భక్తుల రద్దీ పెరిగిపోవడంతో ఆలయానికి సంబంధం లేని వారు వీఐపీల పేరుతో భక్తులకు ఉచితంగా దర్శనాలు కల్పిస్తూ వారి వద్ద డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఆలయంలో సరైన పర్యవేక్షణ లేకపోవడంతో వీరి ఆగడాలకు అడ్డూ అదుపులేకుండా పోతుందని చర్చలు సాగుతున్నాయి.

దశలవారీగా గ్యారంటీలు అమలు చేస్తాం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



మహిళలను ఆత్మీయంగా పలకరిస్తున్న విప్ ఆది

చందుర్తి(వేములవాడ): దశలవారీగా కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసి అర్హులందరికీ అందజేస్తామని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శనివారం రాత్రి చందుర్తి మండలం మల్యాలలో కృతజ్ఞత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విప్ గ్రామంలోని వీధివీధినా తిరుగుతూ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపి మాట్లాడారు. ప్రజల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వానికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలతో పబ్బం గడిపేందుకు సిద్ధమయ్యాయని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగం కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, గ్రామ అధ్యక్షుడు ఇందూరి ప్రసాద్, మల్యాల రాజయ్య, దొంగరి భూమయ్య, ఈసరి నాంపెల్లి పాల్గొన్నారు.

ముఖ్యకార్యకర్తల ఆత్మీయ సమావేశం

వేములవాడఅర్బన్: వేములవాడ అర్బన్ మండల కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమావేశానికి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. ముంపు గ్రామాల సమస్యలు పరిష్కారిస్తామన్నారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య, ఎంపీటీసీ బస రాజశేఖర్, ఎర్రం రాజు, చింతపల్లి శ్రీనివాసరావు, ముడికె చంద్రశేఖర్, పండుగ ప్రదీప్, కదిరె రాజు, ఎర్రం ఆగయ్య, వంగ పర్శరాములు, ఎర్రం సత్తయ్య, దేవరాజు, రాజు పాల్గొన్నారు.

ఐఎస్ఐ ముద్ర ఉన్న వస్తువులనే వినియోగించాలి



బహుమతులు అందజేస్తున్న ప్రభాకర్

సిరిసిల్లఎడ్యుకేషన్: నాణ్యతను తెలిపే ఐఎస్ఐ ముద్ర ఉన్న వస్తువులనే వినియోగించాలని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ కో ఆర్డినేటర్ ప్రభాకర్ అన్నారు. శనివారం సిరిసిల్లలోని విద్యానగర్ బాలికల పాఠశాలలో విద్యార్థులకు ఐఎస్ఐ ముద్ర, దాని ప్రాముఖ్యత గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలాగే విద్యార్థులు వారి తల్లితండ్రులకు, పరిసర ప్రజలకు అవగాహన కల్పించేలా తర్ఫీదునిచ్చారు. ఐఎస్ఐ విధానాలపై పోటీ పరీక్షలు నిర్వహించి గెలుపొందినవారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ ఆఫీసర్ దేవయ్య, హెచ్‌ఎం శారద తదితరులు పాల్గొన్నారు. బహుమతులు గెలుచుకున్న విద్యార్థుల్లో పైజా, అభినవి, రేష్మిక, వర్షిని, హారిక ఉన్నారు.

శాస్త్రీయ ఆచరణతో ముందుకెళ్లాలి



మాట్లాడుతున్న డీఈవో రమేశ్

సిరిసిల్లఎడ్యుకేషన్: విద్యార్థులు శాస్త్రీయతను అలవర్చుకుని ముందుకుసాగాలని జిల్లా విద్యాధికారి రమేశ్ అన్నారు. సిరిసిల్లలో జిల్లా గ్రంథాలయంలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్ష నిర్వహించగా ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులందించారు. సాంకేతిక, శాస్త్రీయ విధానాలు ఉన్న నేటి సమయంలో ప్రజలు మూఢనమ్మకాలను నమ్మడం బాధాకరమని, ఇలాంటివాటిపై పిల్లలకు విద్యార్థి దశ నుంచి చైతన్యం కలిగించడంలో జేవీవీ కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రామరాజు, జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి సంపతి రమేశ్, జిల్లా సైన్స్ ఆఫీసర్ దేవయ్య, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాకాల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలి



ధర్నా చేస్తున్న ఆటోడ్రైవర్లు

గంభీరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం ఆటోడ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ గంభీరావుపేట మండలకేంద్రంలో శనివారం ధర్నా నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి తమ కుటుంబాల ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకొని తగు ప్రకటన చేయాలన్నారు. హైదరాబాద్‌లో ఆటోను తగులబెట్టుకున్న డ్రైవర్‌ను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు ఇబాదుల్లాఖాన్, నాయకులు రాజు, భానుచందర్, శంకర్, మహేశ్, రమేశ్, ఖలీల్, ప్రవీణ్, రాజారాం, శ్రీకాంత్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణాల ఆవశ్యకతపై అవగాహన



మాట్లాడుతున్న ప్రభాకర్

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారంలోని శ్రీ రాజరాజేశ్వరస్వామి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం కేంద్ర ప్రభుత్వ సంస్థ, భారతీయ ప్రమాణాల సంస్థ హైదరాబాద్ ఆధ్వర్యంలో ప్రమాణాల ఆవశ్యకతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బీఐఎస్ రిసోర్స్‌పర్సన్ గిరిధారి ప్రభాకర్ భారతీయ ప్రమాణాల సంస్థ నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ రాజగోపాల్ ఇంజినీరింగ్ విభాగాల్లో బీఐఎస్ ప్రమాణాలను వివరించారు. విద్యార్థులకు ప్రమాణాల తయారీ పోటీ పరీక్ష నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. అధ్యాపకులు ప్రభాకరాచారి, కృష్ణమనోహర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల స్థలం పరిశీలన

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం మర్రిపల్లిలో తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలకు కేటాయించిన స్థలాన్ని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఎండీ సర్వర్‌మియా, ప్రిన్సిపాల్ రాజేశ్ శనివారం పరిశీలించారు. అనంతరం పాఠశాలలోని వసతులు గురించి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు పూర్ణచందర్, ఉస్మాన్ తదితరులు ఉన్నారు.

జ్వరబాధితులకు వైద్యపరీక్షలు

- పదిరలో ప్రబలుతున్న విషజ్వరాలు
- జ్వరాలు అదుపులో ఉన్నాయి..
- జిల్లా ఉప వైద్యాధికారి శ్రీరాములు



పదిరలో జ్వరపీడితులకు వైద్యం అందిస్తున్న వైద్యులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని పదిర గ్రామంలో విషజ్వరాలతో బాధపడుతున్న బాధితులకు శనివారం వైద్యబృందం హెల్త్‌క్యాంప్ నిర్వహించి వైద్యం అందించారు. గ్రామస్తులు గత నెల రోజులుగా జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న మండల వైద్యాధికారి స్రవంతి గ్రామానికి వెళ్లి 7 బృందాలుగా విడిపోయి ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సర్వేను పరిశీలించిన జిల్లా డిప్యూటీ వైద్యాధికారి శ్రీరాములు మాట్లాడుతూ.. 158 మంది రక్త నమూనాలను సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ప్రజలు భయపడి ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి డబ్బులు దుర్వినియోగం చేసుకోకుండా ప్రభుత్వం అందిస్తున్న వైద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. డెంగీ పరీక్ష జిల్లా ఆస్పత్రిలోనే చేస్తారన్నారు. ప్రస్తుతం పదిరలో జ్వరాలు అదుపులో ఉన్నాయన్నారు. వైద్యాధికారి స్రవంతి, సూపర్‌వైజర్ పద్మ, ఎంఎల్‌హెచ్‌పీ లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

వేములవాడ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళా డాక్టర్లకు సన్మానం



మహిళా డాక్టర్‌ను సన్మానిస్తున్న ట్రస్టు ప్రతినిధులు



సన్మానిస్తున్న వెంకటరమణారెడ్డి, ఎంపీపీ మానస

వేములవాడ: జాతీయ మహిళా డాక్టర్ దినోత్సవం సందర్భంగా వేములవాడలోని మహిళా డాక్టర్లనుమై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు శనివారం సన్మానించారు. సభ్యులు మధు మహేశ్, గొంగళ్ల రవికుమార్, మహమ్మద్ రఫీక్, పొలాస రాజేందర్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రజాప్రతినిధులకు..

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మేజర్ గ్రామపంచాయతీ మాజీ పాలకవర్గాన్ని శనివారం సింగిల్‌విండో వైస్‌చైర్మన్ ఎగుమామిడి వెంటకరమణారెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ పడిగెల మానస శాలువాతో సత్కరించి మెమొంటోలు అందజేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, ఫ్రెండ్స్‌క్లబ్ అధ్యక్షుడు ఎడమల శ్రీధర్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు ఆసాని జనార్దన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ సద్ది రోజ, పద్మశాలీ సంఘం అధ్యక్షుడు రాపెల్లి ఆనందం, బండి జగన్, ఆసాని సత్యనారాయణరెడ్డి, పెద్దూరి బాలయ్య, రామచంద్రం, అబుబాకర్, మచ్చ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రంగంపేట పాఠశాలలో ఘనంగా కలర్స్ డే



వీర్నపల్లి: మండలంలోని రంగంపేట ప్రాథమిక పాఠశాలలో శనివారం తెలుపు రంగు దినోత్సవ వేడుకలను హెచ్‌ఎం కె.ప్రవీణ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తెలుపు రంగు డ్రెస్సులు వేసుకొని, ఆ రంగులో ఉండే వస్తువులతో కార్యక్రమం నిర్వహించారు.ఉపాధ్యాయులు మనస్విని, దివ్యరాణి, సుజాత, రూప తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ విద్యార్థుల విహారయాత్ర



విహారయాత్రలో విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని విజ్ఞాన్ ఇంగ్లిష్ మీడియం ప్రైమరీ విద్యార్థులు శనివారం విహారయాత్రకు తరలివెళ్లారు. పాఠశాలకు చెందిన 300 మందిని కరస్పాండెంట్ లతీఫ్ సిరిసిల్లలోని ఇందిరాపార్క్‌కు తీసుకెళ్లారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యార్థులు పార్క్‌లో అనేక విషయాలు తెలుసుకున్నట్లు ప్రిన్సిపాల్ సంతోష్ తెలిపారు.